క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



చారకొండ: మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని నెమలి గుట్ట తండాల్లో రాత్లావత్ గోర్గి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.5వేలను బాధిత కుటుంబానికి తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మున్నా, శ్రీను, గోపాల్, తదితరులు ఉన్నారు.

'మాభూమి రథయాత్ర'ను విజయవంతం చేయండి

చారకొండ: అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారాధన్ మహరాజ్ చేపడుతున్న లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మహరాజ్, ఉపాధ్యక్షుడు మల్లేష్, మహేష్ విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికారమే ధ్యేయంగా రథయాత్ర నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. బహుజనులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ మహదేవ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల వద్ద ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ నరేష్‌లు ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహ, సింగిల్ విండో చైర్మన్ చంద్రయ్య, కృష్ణారెడ్డి, పరమేష్, సాయిరాం పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగించండి

బల్మూర్: మండల కేంద్రం బల్మూర్ నుంచి గోదల్ వెళ్లే పీఆర్ రహదారికి ఇరువైపులా ప్రమాదభరితంగా మారిన కంప చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుపైకి కొమ్మలు వాలడంతో వాహనదారులకు తగిలి ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉందని వాపోతున్నారు. మండల కేంద్రం బల్మూర్ నుంచి గోదల్ వరకు కంప చెట్లు రోడ్డుపై అల్లుకుపోయి ఉన్నాయని, వాటిని తొలగించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే దిక్కే లేదని విమర్శిస్తున్నారు. వెంటనే పీఆర్ అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు



వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు యువకులు, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసి పూలమాలలతో అలంకరించారు.

మల్లేశ్వరంలో బోరు డ్రిల్లింగ్

పెంట్లవెల్లి: తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఇటీవల మండలంలోని మల్లేశ్వరం గ్రామస్తులు మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంత్రి కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను వివరించారు. దీంతో కలెక్టర్ నిధుల నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేశారు. ఆదివారం రెండు బోర్లు డ్రిల్లింగ్ చేయగా నీరు పుష్కలంగా వచ్చింది. గ్రామస్తులు మంత్రికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, డిష్‌రవి, నర్సింహనాయుడు, రాముడు, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

దైవచింతనతో మెలగాలి

కల్వకుర్తి రూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరు దైవచింతనతో మెలగాలి అని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి కోరారు. ఆదివారం మండలంలోని వేపూరులో బీరప్ప పండుగకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. దుర్గాప్రసాద్, రాంభూపాల్ రెడ్డి, సురేందర్ గౌడ్, శేఖర్ రెడ్డి, నరేష్ గౌడ్, శ్యాంసుందర్, శ్రీకాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలు దుర్భరం

- పెరిగిన పని భారం
- సకాలంలో పంచాయతీ కార్మికులకు అందని వేతనాలు



వీధిలైట్లు బిగిస్తున్న కార్మికుడు



మురుగు కాల్వను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

కల్వకుర్తి రూరల్: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతో కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పారిశుద్ధ్యంలో ఎంతో కీలకమైన పంచాయతీ కార్మికుల వేతనాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. వారికి సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో జీవితాలు దుర్భరంగా మారాయి. పూల గడవలేని పరిస్థితి దాపురించింది. బతికేందుకు అప్పులు చేసి జీవితాలను నెట్టుకొస్తున్నామని పంచాయతీ కార్మికులు వాపోతున్నారు.

మల్టీపర్పస్ రద్దుకు డిమాండ్

ఉదయం లేచింది మొదలు డ్రెయినేజీ, వీధులు శుభ్రం చేయడం, ఇంటి పన్నులు, నల్ల పన్నులు వసూలు చేయడం, వీధిలైట్లతో పాటు అధికారులు చెప్పిన పనులు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు నెలవారిగా వేతనాలు రాకపోవడం గత ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పంచాయతీ కార్మికులు, యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ కార్మికులందరినీ మల్టీపర్పస్ వర్కర్లుగా పేర్కొంటూ జీఓ నంబర్ 51ని తీసుకొచ్చారు. గతంలో గ్రామంలోని సఫాయి, వాటర్ మెన్, కారోబార్, ఎలక్ట్రిషన్, డ్రైవర్ ఎవరి పని వారు చేసేవారు. దీంతో వారికి గ్రామంలో ప్రత్యేక గుర్తింపు ఉండేది. కానీ మల్టీపర్పస్ విధానం ప్రకారం కార్మికులు అందరూ అన్ని పనులు చేయాలని ప్రభుత్వం అప్పట్లో ఆదేశించింది. దీంతో వారికి గుర్తింపు లేకుండా పోవడంతో మల్టీపర్పస్ విధానం రద్దు కోసం డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు నేరుగా కార్మికుల ఖాతాల్లోకి జీతాలు వేయాలని డిమాండ్ కార్మికులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యక్రమాలను చేపడుతున్నారు.

రెండు నెలలుగా..

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీలలో 42 వేల మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 1800 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం టీస్ బిపాస్ ద్వారా కార్మికులకు జీతాలు అందుతున్నాయి. ట్రెజరీల ద్వారా నవంబర్, డిసెంబర్ నెలలో వేసిన జీతాలు ఎస్టీఓలో పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే ఆ జీతాలు ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు.

వివరాలు సేకరించినా..

గ్రామ పంచాయతీల ద్వారా జీతాలు చెల్లించేవారు. కార్యదర్శి ఎప్పుడు జీతం ఇస్తే అప్పుడే తీసుకోవాల్సిన పరిస్థితి. పంచాయతీ ఖాతాల్లో నిధులు లేవని సాకు చూపుతూ కార్మికుల జీతాలు ఆలస్యం చేసేవారు. దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి నేరుగా కార్మికుల ఖాతాలలోకి జీతాలు వేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి కార్మికులకు సంబంధించిన అన్ని వివరాలను అధికారులు సేకరించారు. జనవరిలో వేస్తామని చెప్పిన ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదు.

కార్మికులకు గుర్తింపు లేదు



మల్టీపర్పస్ విధానంతో పంచాయతీ కార్మికులను గుర్తించడం లేదు. కార్మికులతో వెట్టి చాకిరీ పనులు చేయించుకుంటున్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి. కార్మికులకు సరైన సమయంలో వేతనాలు ఇవ్వాలి. వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలి. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తాం.

– ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

జీతాలు చెల్లిస్తాం

గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలకు ఇబ్బంది లేదు. ప్రభుత్వానికి మరోసారి జీతాలు ఇవ్వాలని నివేదిక పంపించాం. రెండు నెలల వేతనాలు కార్మికులకు త్వరలో చెల్లిస్తాం. ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– రామ్మోహన్, జిల్లా పంచాయతీ అధికారి

ఘనంగా అంజన్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బిజినేపల్లి: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణం తర్వాత ఆదివారం ధ్వజస్తంభ, దత్తాత్రేయ స్వామి వార్ల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రయ్య(68) అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచుల అధ్యక్షుడు వెంకటరమణ, పాండు పాల్గొన్నారు.

అమ్మపల్లిలో..

తిమ్మాజిపేట: మండలంలోని అమ్మపల్లి మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. గ్రామ మాజీ సర్పంచ్ ముంగి నర్సింహారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, నాయకులు ఇబ్రహీం, సైఫ్, స్థానిక నాయకులు ఉన్నారు.

సమస్యలపై అలుపెరగని పోరాటం



కార్యవర్గంతో ఆ పార్టీ జిల్లా నాయకులు

దోమలపెంట: ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని నాగర్ కర్నూల్ జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి బాల నరసింహ అన్నారు. ఆదివారం ఈగలపెంటలో ఆ పార్టీ శ్రీశైలం ప్రాజెక్టు కార్యదర్శి కె.నాగిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దోమలపెంట భవన నిర్మాణ శాఖ సంఘం నుంచి ఆయన సమక్షంలో 15 మంది సీపీఐలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం దోమలపెంట శాఖ కార్యదర్శిగా కె.విష్ణు, సహాయ కార్యదర్శులుగా ఎం.నాగేశ్వరరావు, కె.ప్రసాద్‌తో పాటు తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు కేశవ్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, అచ్చంపేట సీపీఐ నాయకుడు గోపాల్, ఆ పార్టీ శ్రీశైలం ప్రాజెక్టు కార్యదర్శి పులిరాజు, అన్వర్ బాషా తెలిపారు.

బీపీ మండల్ నివేదిక అమలుపర్చాలి



అమ్రాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కొల్లాపూర్: బీసీల రిజర్వేషన్ల అమలు కోసం బీపీ మండల్ ఇచ్చిన నివేదికను పూర్తిస్థాయిలో అమలుపర్చాలని యాదవజాగృతి సేన నాయకులు డిమాండ్ చేశారు. బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా కొల్లాపూర్‌లో ఆయన చిత్రపటానికి యాదవజాగృతిసేన నాయకులు మేకల రాముడుయాదవ్, బరిగెల బాలయ్యయాదవ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల కిందటే బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేసిన మహనీయుడు బీపీ మండల్ అని కొనియాడారు. రాజకీయంగా, ఆర్థికంగా వెనకబాటుకు గురవుతున్న బీసీల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప నేత అని వివరించారు. కార్యక్రమంలో నాయకులు సాయిలుయాదవ్, గడ్డం శేఖర్ యాదవ్, చంద్రయ్యయాదవ్, భాస్కర్‌యాదవ్, విజయ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మండల్‌కు నివాళి

మన్ననూర్: బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ వర్ధంతిని అమ్రాబాద్ మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి అమ్రాబాద్ మండలానికి చెందిన పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటయ్య ముదిరాజ్, బాలింగంగౌడ్, రఘురామచారి, అంజన్న, కృష్ణయ్య, వీరప్ప, కరుణాకర్, నిరంజన్, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి

నాగర్‌కర్నూల్ రూరల్/తెలకపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజీవ్ యువశక్తి దరఖాస్తు గడువును పొడిగించాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగపూర్ మధు , సీపీఎం రాష్ట్ర నాయకులు గోపాస్ లక్ష్మణ్ ఆదివారం వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14వ వరకు గడువు విధించిందని కాని చాలామంది నిరుద్యోగులు కుల ఆదాయ సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దరఖాస్తు గడువును మరిన్ని రోజులు పెంచాలని ఆయన కోరారు.

రైతుల హక్కుల సాధనకు ఉద్యమిస్తాం

పాన్‌గల్: రైతుల హక్కుల సాధన కోసం రైతులతో కలిసి ఉద్యమిస్తామని రైతు సంఘం జిల్లా నాయకులు బాబునాయక్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని రేమద్దుల, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా రైతు సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చి వారి హక్కులను కాలరాస్తుందన్నారు. రైతు సంఘం రైతుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందన్నారు.

ఈత మట్టల ఊరేగింపు




అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎంబీషాలెం చర్చిలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో ఈత మట్టలతో ఊరేగింపుగా వెళ్లారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ పరంజ్యోతి, జేమ్స్, కర్ణాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థికి సన్మానం

కల్వకుర్తి రూరల్: ఇటీవల వెలువడిన గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో డాక్టర్ సాహితి సత్తాచాటింది. ఈ మేరకు ఆదివారం పట్టణంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ ఆమెను అభినందించి సన్మానించారు. ఆయన వెంట రిటైర్డ్ ఎంఈఓ కృష్ణయ్య, ఉపాధ్యాయులు, వందేమాతరం కార్యకర్తలు ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని పాత యాపట్లలో సన్న బియ్యాన్ని మాజీ సర్పంచ్ రమేష్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నబియ్యాన్ని అందజేస్తున్నారని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరికి నెల 6 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సితారం నాయక్, అంజన్‌కుమార్, జహంగీర్, బిచ్చన్న బాలచంద్రర్, శ్రీశైలం డీలర్ రాజు పాల్గొన్నారు.



సేవలను ముందుకు తీసుకెళ్లాలి



కిషన్ ను సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్‌లు కోరారు. ఆదివారం పట్టణంలో కల్వకుర్తి డివిజన్ క్లాస్‌మేట్ క్లబ్ కోశాధికారిగా గుబ్బ కిషన్‌ను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకోవాలని ఆసక్తి ఉన్న ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి క్లబ్ చేయూతనందిస్తూ వారి ఉన్నత విద్య కోసం కృషి చేస్తుందన్నారు. ఈ నెల 23న ప్రపంచ పుస్తక దినోత్సవంను వివిధ పాఠశాలలో నిర్వహించాలని వాసా రాఘవేందర్, కల్మిచర్ల రమేష్‌లు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా అధ్యక్షుడు కేబీ ప్రసాద్ జిల్లా హెల్త్ కమిటీ చైర్మన్ శ్రీధర్ జిల్లా కార్యదర్శి శోభన్ బాబు, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ఆచారి

వెల్దండ: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేసి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యుడు ఆచారి హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జంగయ్యయాదవ్, రాష్ట్ర నాయకులు తాటికొండ కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంముదిరాజ్, దేవేందర్‌ముదిరాజ్, రామస్వామి, పాండు, శ్రీనివాస్‌రెడ్డి, రవి కుమార్, గెల్వయ్య, రమేష్, ధర్మేందర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు నివాళి

లింగాల: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ దగ్గర ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం బీజేపీ నాయకులు నీటితో శుద్ధి చేసి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల నాయకుడు నవీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 25 వరకు అంబేడ్కర్ జయంతి ఉత్సవాల పేరుతో కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు విష్ణు, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా నాయకులు ఉలస్ మహేష్, నాయకులు హేమంత్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అంజయ్య

బల్మూర్: విద్యార్థి దశ నుంచే వారిలో సామాజిక స్పృహ కల్పించాలన్నదే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని నోడల్ కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య తెలిపారు. మండలంలోని రాంనగర్ కాలనీలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వేసవి కాల శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు బాల్య వివాహాల నిర్మూలన, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి వివిధ కార్యక్రమాలపై విద్యార్థులు ప్రజలను చైతన్యం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు సేవా పథకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరంగి రవి, ప్రోగ్రాం అధికారి డా.వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఏఈఓ శిరీష, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు తరలిరావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి

కోడేరు: ఈ నెల 27న బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేస్తు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలన్నారు. అనంతరం బావాయిపల్లి మాజీ సర్పంచ్ కర్రెమ్మ భర్త మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అదే విధంగా గుండెపోటుతో మృతి చెందిన డీలర్ వెంకటరమణ, కార్యకర్త కురుమయ్య కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, దూరెడ్డి రఘువర్ధన్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, లాలు, శేఖర్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు



వెల్దండ: మండలంంలోని ఆయా గ్రామాల్లో ప్రయాణికులకు నిల్వ నీడలేపోవడంతో వేసవిలో అవస్థలు పడుతున్నారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై మండలంలోని పెద్దాపూర్, చెర్కూర్, కొట్రగేట్, రాఘయపల్లి బస్‌స్టేజీల్లో ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ఉన్న బస్టాండ్‌లు రోడ్డు వెడల్పు పనులు చేయడంతో కాంట్రాక్టర్లు తొలగించారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ స్టేజీల వద్ద ప్రయాణికుల సౌకర్యం కోసం బస్టాండ్‌లను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల నాయకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

జాతర కళాకారుల కమిటీ ఎన్నిక



నాగర్‌కర్నూల్ రూరల్: ఈ నెల 26న జిల్లా కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే బహుజన మహనీయుల జాతర ఏర్పాట్ల నిర్వహణ కోసం బహుజన కళాకారుల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. బహుజన జాతర కళాకారుల కమిటీ కన్వీనర్‌గా నాగరాజు, పాదిల రేనుక జంగయ్య, విజయ్, శేఖర్, అర్జున్, సోమన్న పరశురాం 20 మందితో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్లు పృథ్వీరాజ్, జిల్లా కమిటీ నాయకులు బోనాశ్రీ రాంచందర్, కొత్తపల్లి కుమార్, కల్యాణ్, శ్రీను, మధు, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కొల్లాపూర్‌లో నినదిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలో టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను సీనియర్ నాయకుడు గోవర్ధన్ ఆవిష్కరించారు. అంతకుముందు 2కె రన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: పట్టణంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకులు మహిమూద్ ఎగురవేశారు. సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణయాదవ్, శంకర్‌నాయక్, మహేష్, రబ్బాని, శ్రీరామ్‌నాయక్, కుమారస్వామి, బషీర్, కురుమయ్య ఉన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు రామలింగం ఆ సంఘం జెండా ఎగురవేశారు. నాటి ఉద్యమ నేతల స్ఫూర్తితో ఉద్యమిస్తూ సమస్యలను సాధిస్తున్నామన్నారు. మండల శాఖ అధ్యక్షుడు నెహ్రూ ప్రసాద్, రాష్ట్ర నాయకులు చిన్నయ్య, శ్రీరాములు, ఆంజనేయులు గౌడ్, శశికళ దేవి, పాండయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.